సీఎం కేసీఆర్‌తోనే నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్


విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

హోంమంత్రి మహమూద్ అలీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో గురుకుల పాఠశాలల ద్వారా పేద పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ముషీరాబాద్ మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన విద్యా దినోత్సవంలో హోంమంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఏర్పడితే రాష్ట్రం అన్ని విధాలుగా వెనుకబడిపోతుందని చాలా మంది కాంగ్రెస్, టీడీపీ నాయకులు అన్నారని కానీ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సంక్షేమంతో పాటు అన్ని రంగాలను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యా ప్రగతిని సాధించడానికి ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాల ద్వారా నేడు మంచి ఫలితాలు వస్తున్నాయని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న గురుకుల పాఠశాలలకు ఎకరా స్థలం కేటాయించాలని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సొంత భవనం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతోనే నేడు పేదలకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ చిరంజీవి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పవన్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీవాణి, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, యువజన విభాగం నాయకుడు జైసింహ పాల్గొన్నారు.

తెలంగాణ విద్యా వ్యవస్థ దేశానికి ఆదర్శం


ఉపాధ్యాయులను సత్కరించిన సుధాకర్ రెడ్డి

అంబర్‌పేట: రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి సీఎం కేసీఆర్ ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఛే నంబరు చౌరస్తాలోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద విద్యార్థుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే మన బస్తీ– మన బడి పథకం కింద రూ.7289 కోట్ల నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల మౌలిక వసతులను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అలాగే విదేశాల్లో ఉన్నత చదువుల కోసం స్కాలర్‌షిప్‌ను అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 1200 మంది విద్యార్థులు హాజరు కాగా ప్రముఖ మోటివేషన్ స్పీకర్ గంప నాగేశ్వర్‌రావు పలు స్ఫూర్తినిచ్చే అంశాలను సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ వేణుగోపాల్, డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మీ, ఐఓఎస్ నిజాముద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కాచిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం కాచిగూడలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యా దినోత్సవ వేడుకలను బీఆర్‌ఎస్ రాష్ట్ర మహిళా నేత దేవిరెడ్డి విజితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని టీచర్లను సత్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం ప్రగతి బాటలో ముందుకు సాగుతుందని, తొమ్మిదేళ్లలో ఊహించని విధంగా విద్యాభివృద్ధిలో పురోగతిని సాధించిందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యారంగాన్ని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యా బోధన, మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో గ్రామీణులకు, పేదలకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఓ పక్క ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ మరోపక్క సంక్షేమ శాఖల వారీగా కొత్తగా గురుకుల పాఠశాలలను నెలకొల్పుతున్నారన్నారు. రమేష్, పులిజగన్, నగేష్ గౌడ్, మురళీకృష్ణ, సులోచన రెడ్డి, జీవన్‌గౌడ్, కోట్ల రాము, మాధవరెడ్డి, జనార్ధన్, చందర్, రాహుల్, నాగమణి, వెంకటమ్మ, అండాలు, విజయలక్ష్మీ, సూర్యలక్ష్మీ పాల్గొన్నారు.

‘మహిళలను విస్మరించిన మోదీ సర్కార్’

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మోదీ సర్కార్ తొమ్మిదేళ్ల పాలనలో మహిళలను విస్మరించిందని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుధాసుందర్‌రామన్ విమర్శించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుధాసుందర్‌రామన్ మాట్లాడారు. తొమ్మిదేళ్లలో ప్రజలకు ఎంతో చేశామని ప్రధానమంత్రి గొప్పలు చెబుతున్నారని మహిళల అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆర్థిక, సంస్కృతిక, సామాజిక సమస్యలు ఈ మధ్య కాలంలో పెద్ద ఎత్తున ముందుకు వచ్చాయని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను పేదలకు అందనంత ఎత్తుకు పెరిగిపోయాయన్నారు. రూ. 400 ఉన్న గ్యాస్ ధర ప్రస్తుతం రూ. 1200లకు పెరగడం నిజం కాదా అని ప్రశ్నించారు. సబ్సిడీలను ఎత్తివేసి మహిళలను మోసం చేశారని విమర్శించారు. మోదీ ప్రభుత్వంలో మహిళలు ఉపాధి తగ్గిందని అసంఘటిత రంగంలోని ఏదో ఒక పని చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత లేదని కార్మిక చట్టాల రద్దు వల్ల శ్రామిక మహిళల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు అరకొరగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అరుణజ్యోతి, మల్లు లక్ష్మి, టి.జ్యోతి, కె.ఎన్.ఆశలత, వినోద పాల్గొన్నారు.

బీసీ బంధును వెంటనే అమలు చేయాలి

కాచిగూడ: బీసీల అభ్యున్నతికి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రకటించిన బీసీ బంధును వెంటనే అమలు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల వృత్తులపై ఆధారపడ్డ లక్షలాది మంది పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. దళిత బంధు కింద ఒక్కో ఎస్సీ కుటుంబానికి రూ.10 లక్షలు ఇస్తున్న ప్రభుత్వం రాష్ట్రంలోని 130 బీసీ కులాలకు రూ.లక్ష ఇవ్వకుండా కేవలం 14 కులాలకే ఇస్తామనడం అన్యాయమన్నారు. నిర్ణీత గడువు లేకుండా రాష్ట్రంలోని 130 బీసీ కులాలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు డాక్టర్ ప్రశాంత్, భూషణ్, భాస్కర్, శివనాగేశ్వర్‌రావు, నిత్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న
బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్

25న మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 25న కాచిగూడలోని మున్నూరుకాపు భవన్ మ్యాడం అంజయ్య హాల్‌లో మున్నూరుకాపు వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యువతి, యువకులు ఈ వివాహ పరిచయ వేదికలో పాల్గొని వివాహ సంబంధాలు కుదుర్చుకోవాలని సూచించారు. మంచి సంబంధాలు కుదరడం సమస్యగా మారిన నేటి కాలంలో స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న పరిచయ వేదికల ద్వారా సులభంగా సంబంధాలను కుదుర్చుకోవచ్చని తెలిపారు. ఇలాంటి వేదికల ద్వారానే ఆయా కుటుంబాల నేపథ్యం, వధూవరుల గుణగణాలు కూడా అవగతమవుతాయని చెప్పారు. ప్రతి యేటా మహాసభ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదికలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివాహ పరిచయ వేదిక చైర్మన్ గోపాల రాధాకృష్ణ, కొమ్ము శ్రీనివాస్, లింగిశెట్టి హనుమంతరావు, మణికొండ రమేష్ కుమార్, కొండూరు వినోద్ కుమార్, కొంతం సురేష్‌బాబు, ప్యాట రవీందర్, శ్రీకాంత్, సదానంద్, అనిల్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

కాచిగూడ: ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బీజేపీకి కంచుకోట లాంటి అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని అన్నారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, వై.అమృత, పార్టీ నేతలు బి.వెంకట్‌రెడ్డి, శ్యామ్‌రాజ్, సి.నందకిషోర్‌యాదవ్, వనం రమేష్, చిట్టి శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

వసతుల కల్పనకు పెద్దపీట

అంబర్‌పేట: నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్‌లో రూ.6.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న తాగునీటి పైపులైన్ పనులను ఆయన కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం స్థానికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

- గోల్నాక డివిజన్ మారుతినగర్‌లో స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆరె కులాన్ని రూ.లక్ష ఆర్థిక సహాయ జాబితాలో చేర్చాలి

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీసీలకు రూ.లక్ష పథకంలో ఆరె కులాన్ని చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెట్టిపల్లి శివాజీ కోరారు. ఆరె కులం సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిందని రాష్ట్ర ప్రభుత్వం పథకం కోసం ప్రకటించిన 15 కులాల్లో తమ ఆరె కులం లేకపోవడం విచారకరమన్నారు. అక్షరాస్యత, ఉద్యోగాలు, సగటుగా ఆర్థికంగా ఆరె కులస్తులు వెనుకబడి ఉన్నారన్నారు. తమ కులం వారు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారని, వారి స్థితిగతులను పరిశీలించి తక్షణమే బీసీలకు రూ.1 లక్ష ఆర్థిక సహాయం పథకంలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాత పుస్తకాల పంపిణీ

కాచిగూడ: బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య కన్నా ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ, స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



చిక్కడపల్లి: పెండిగ్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలలి గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఇంజినీరింగ్ సెక్షన్ డీఈ గీత, ఎఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో మొదలైన పలు అభివృద్ధి పనులు జాప్యం లేకుండా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. మంజూరైన మరికొన్ని అభివృద్ధి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించాలన్నారు.

బాలిక అదృశ్యం

కాచిగూడ: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థిని అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డకు చెందిన ఓ విద్యార్థిని (18) పది పరీక్షలో ఫెయిల్ అయింది. ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంట్లో చెప్పకుండా వెళ్లిన వ్యక్తి ..

చిక్కడపల్లి: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ వివరాల ప్రకారం.. నాగమయ్యకుంటలో నివసించే దీపక్ (40) మంగళవారం ఇంట్లో చెప్పకుండా వెళ్లి రాత్రైనా రాలేదు. ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య స్వాతి ఫిర్యాదు చేశారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

చిక్కడపల్లి: చిక్కడపల్లి మెట్రో స్టేషన్ వద్ద గుర్తు తెలియని ఆటో ఢీకొట్టడంతో గుర్తు తెలియని ఓ వ్యక్తి (50) మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదని ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా మురళీమోహన్

కాచిగూడ: ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త టిల్లా మురళీమోహన్ తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా ఎన్నికయ్యారు. మంగళవారం బర్కత్‌పురలోని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మురళీమోహన్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత 25 సంవత్సరాలుగా మురళీమోహన్ పర్యావరణ పరిరక్షణ, శాంతి, జాతీయ సమైక్యత, మత సామరస్యంపై యువకులు, విద్యార్థులకు ఎన్నో చైతన్య కార్యక్రమాలు, ర్యాలీలు, సదస్సుల ద్వారా జాగృతం చేశారు. ఈ సందర్భంగా ఆయనను తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్‌తో పాటు కమిటీ సభ్యులు సత్కరించి అభినందనలు తెలిపారు.

ఆప్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్రంలో ఆప్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇందిరాపార్కులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ తరహా తెలంగాణ రాష్ట్రంలోనూ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం, విద్యుత్ అందజేస్తామన్నారు. రాష్ట్రంలో అనేక మంది ఆప్ పార్టీలోకి చేరడానికి ముందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజీద్, రంగయ్య, రాథోడ్, హరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కవాడిగూడ: దోమలగూడ బాలత్రిపుర సుందరీ దేవి అమ్మవారి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా అమ్మవారి ఊరేగింపు జరిగింది. పూజకు హాజరైన భక్తులకు ఆలయ చైర్మన్ శాలువాలతో సత్కరించారు.

చెట్ల కొమ్మల తొలగింపు



కాచిగూడ: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వచ్చే ప్రమాదాలను ముందు జాగ్రత్తగా గుర్తించి డివిజన్‌లో అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తెలిపారు. బర్కత్‌పుర భూమన్న లేన్‌లో ఓ భారీ వృక్షం కొమ్మలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయగా స్పందించిన ఆమె మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బందిని పిలిపించి చెట్ల కొమ్మలను తొలగింప చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ యూబీడీ అధికారి బ్లెస్సీ, బీజేపీ నేతలు బండారు సంతోష్, సుభాష్ పటేల్, ఏ.సూర్యప్రకాష్ సింగ్, ప్రతిభ, శాంతాబాయి, భీమ్‌రాజ్, మల్లిఖార్జున్ ఓంప్రకాష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు కృషిచేస్తా


మొక్క నాటుతున్న పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: డివిజన్‌లో పార్కులు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు చొరవ తీసుకుంటానని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని ఇందిరాప్రస్థాకాలనీ పార్కులో పార్టీ నాయకులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటేందుకు చొరవ తీసుకోవాలన్నారు. వచ్చే వర్షకాలంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, జగన్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్

కవాడిగూడ: దోమలగూడ ఏవీ ఆర్ట్స్, సైన్స్, కమార్స్ కళాశాల సీసీఎంబీ, వీఐటీఎం ద్వారా జీన్ హెల్త్ కాన్వెంట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సివిల్ సెల్ అనిమియా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ జి.ఆర్.చందర్ చీఫ్ సైంటిస్ట్ ప్రసంగించారు. జన్యువుల జీవశాస్త్రంలో వచ్చే మార్పులకు ఎలా దారి తీస్తాయో వివరించారు. పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.భగవంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాజలింగం, ఈవెంట్ కన్వీనర్లు కవిత, స్వాతి, అనిత, ఉమశ్రీ, మనోగన, కేతన్, వైష్ణవి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు స్పందన


పేర్లు నమోదు చేసుకుంటున్న విద్యార్థినులు

కాచిగూడ: జూలై 2న ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీ పరీక్షలకు స్పందన వచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు. మంగళవారం నారాయణగూడ లోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో క్విజ్ పోటీలలో పాల్గొనడానికి ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పేర్ల నమోదు కార్యక్రమంలో విద్యార్థినులు పెద్ద సంఖ్యలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధానకార్యదర్శి డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి, సాధికారత కోసం పాటుపడిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆదర్శం నుంచి యువ భారతీయలు ప్రేరణ పొందడానికి ఈ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నిధులు, నియమకాల కోసం ఉద్యమం చేసి, ఎంతో మంది యువత ప్రాణత్యాగాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న యువతకు నేడు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనడానికి పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు పాల్గొని లక్షల రూపాయల విలువైన ఈ– స్కూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, టాబ్లెట్స్ గెల్చుకునే అవకాశం ఉందన్నారు. 7661899899 నంబర్‌కు మిస్ట్‌కాల్ ఇచ్చి రిఫెరల్ కోడ్ 15011 ఉపయోగించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నీలిమ సూచించారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజనులు, బీసీ వర్గాలు ఉద్యమించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(బోద్ధా తారకం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలకు గురవుతున్న దళిత, బహుజన వర్గాలకు ఆత్మగౌరవం, రాజకీయ సమానత్వం కల్పిస్తు రాజ్యాధికారమే లక్ష్యంగా మహాత్మా జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానంతో బహుజనులు ముందుకు సాగాలన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల దాటినా ఉమ్మడి రాష్ట్రంలో బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి కాలేదన్నారు. దళిత బహుజన కులాల విముక్తి కోసం అగ్రకుల పాలకులకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 97 శాతం ఉన్న దళిత, బహుజన కులాలకు రాజ్యాధికారం దక్కకపోవడానికి కారణం ఐక్యత లోపమే అన్నారు. తెలంగాణలోనే అణగారిన వర్గాల ప్రజలు సొంత ఇళ్లు, స్థలం, ఉపాధి లేక పట్టణ ప్రాంతాలకు వలస పోయి అద్దె ఇంట్లో ఉంటూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగం బహుజన వర్గాల ప్రజలకు కల్పించిన హక్కులను సాధించుకోవడానికి ప్రజా ఉద్యమాలను చేపట్టి ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు.

‘మనబస్తీ- మనబడి’తో పాఠశాలల అభివృద్ధి


విద్యా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, విద్యాశాఖ అధికారి చిరంజీవి

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముషీరాబాద్ మండల విద్యా శాఖ అధికారి చిరంజీవి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మనబస్తీ–మన బడి పేరుతో వేల కోట్ల రూపాయలను వెచ్చించి పాఠశాలల రూపురేఖలను మారుస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా గురుకుల పాఠశాలలు, మైనార్టీ పాఠశాలలను ఏర్పాటు చేసి వారికి నాణ్యతతో కూడిన భోజనాన్ని అందిస్తూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. దీంతో దేశంలోనే అన్ని పోటీ పరీక్షల్లో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ఎన్నికై ఉన్నత చదువులకు వెళ్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సంస్కరణలను విద్యా రంగంలో తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షారామణి, ఉపాధ్యాయులు రవీందర్, నర్సింహరెడ్డి, రమేష్, భవానీ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీ


తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ రవిచారి, సివిల్ సప్లై అధికారులు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి, సివిల్ సప్లై అధికారి దీప్తితో కలిసి మంగళవారం రాంనగర్ డివిజన్ హరినగర్‌లోని 634, 641 రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. పేద ప్రజలకు అందించే నిత్యావసర వస్తువుల నాణ్యత, గురించి అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాలు తెరిచే వేళలు, స్టాక్, రికార్డులను పరిశీలించారు. అలాగే రేషన్ తీసుకునేందుకు వచ్చిన ప్రజలను బియ్యం ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు.

ఏపీ స్పీకర్‌కు వినతి



ముషీరాబాద్: ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి సుమారు పది సంవత్సరాలు కావస్తున్నా ఆర్టీసీలో కిందిస్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులు తమ స్వరాష్ట్రం ఏపీకి వెళ్లేందుకు ఇంత వరకు అవకాశం కలగడం లేదని ఈ విషయమై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరారు. టీఎస్ఆర్టీసీకి చెందిన కండక్టర్ త్రినాథరావు వారి స్వగ్రామమైన శ్రీకాకులం జిల్లా పొందూరులో ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి వినతిపత్రం ఇవ్వగా అందుకు స్పీకర్ సానుకూలంగా స్పందించారన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా

బీసీ విద్యార్థి సంఘం


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

ముషీరాబాద్: ఐదు వేల కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తోందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ విమర్శించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినం సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని సీఎం క్యాంప్ ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులు, స్కైఓవర్లు, ఫ్లైఓవర్లు కట్టడానికి నిధులు ఉంటాయి కానీ పేద విద్యార్థులు చదువుకునే హాస్టల్ భవనాల నిర్మాణానికి నిధులు లేవా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు, హాల్ టికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇంటికో ఉద్యోగం వస్తుందని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ పది సంవత్సరాలు గడుస్తున్నా ఊరికి ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో ఒక్కో రూమ్‌కు 30–35 మంది విద్యార్థులు నివాసించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో అనంతయ్య, గడ్డం నర్సింహ, శంకుయాదవ్, ఈశ్వర్, ప్రదీప్, నిరంజన్, వంశీ, కిరణ్, జనార్ధన్, కరుణాకర్, వేణు పాల్గొన్నారు.

వడ్డెర ఆత్మగౌరవ భవనం ఆదర్శంగా నిలుస్తుంది

చిక్కడపల్లి: వడ్డెర ఆత్మగౌరవ భవనం ఇతర కులాల భవనాలకు ఆదర్శంగా నిలుస్తుందని వడ్డెర ఆత్మగౌరవ భవన నిర్మాణ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ అన్నారు. మంగళవారం చిక్కడపల్లిలో ట్రస్ట్ డైరెక్టర్ ఎత్తరి అంతయ్య అధ్యక్షతన వివిధ జిల్లాలు, నగరాల కుల సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. వడ్డెర ఆత్మగౌరవ భవనాన్ని ఇతర కులాలకు ఆదర్శంగా నిలిచేలా నిర్మించి తీరుతామన్నారు. ఈ సమావేశంలో బ్రహ్మం, డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, సాయికృష్ణ, నగేష్, సంపత్, ఎల్లయ్య, వెంకటనారాయణ, రాంజేంద్రప్రసాద్, దుర్గయ్య, అనంతరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

అమ్మవారి కల్యాణం..అన్నదానం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ బస్తీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు అమ్మవారి ఒడిబియ్యంతో తయారు చేసిన అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య పార్కు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు సలిపెల రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వి.నిరంజన్‌రెడ్డి, నాయకులు అశ్విన్, గోపాల్ సింగ్, డాక్టర్ సునీల్, బాబు, కుమార్, ఎం.శ్రీహరి, చిన్నా, కిట్టు, కృష్ణ, దేవాలయ అధ్యక్షులు శ్రీహరి పాల్గొన్నారు.